# పునర్జన్మ

రాచపూటి రమేష్

"వారం రోజుల్లో మా 'సంచలనమ్' వారపత్రిక స్పెషల్ ఇష్యూ ప్రెస్‌కెళ్తుంది. మా ఎడిటర్ సెన్సేషనల్ న్యూస్ స్టోరీ ఏదైనా కవర్ చేసి ఇవ్వమని నా ప్రాణాలు తోడేస్తున్నాడు. ఇప్పటికిప్పుడు అటువంటి ఇన్వెస్టిగేటివ్ స్టోరీని ఎక్కడ నుంచి పట్టుకురావాలో నాకు బొత్తిగా అర్థం కాకుండా వుంది" అన్నాడు దినకర్, విచారంగా మొఖం పెట్టి.

ఇలాంగోవన్- దినకర్ ముఖంలోకి పరీక్షగా చూశాడు. కురుక్షేత్రంలో కర్తవ్యం బోధపడని అర్జునుడి ముఖంలా వుందది.

సీ పెరల్ హోటల్ రూఫ్ గార్డెన్‌లోని లాంజ్‌లో కూర్చుని వున్నారిద్దరూ. అమావాస్య రోజులేమో సాయంత్రం ఎనిమిదింటికే చీకట్లు ముసురుతున్నాయి. సముద్రం ఆటుపోట్లతో హోరెత్తుతూ వుంది. చలిగాలి రివ్వున చెంపలకు తాకుతూ వుంది.

యూనిఫామ్‌లోని సర్వర్ ఆర్డర్ కోసం వచ్చాడు. దినకర్ మెనూ కార్డ్ చూసి తందూరీ రోటీ ఆర్డర్ చేశాడు.

ఐదడుగుల ఎత్తులో నల్లగా, లావుగా పోతపోసిన కంచువిగ్రహంలా వుంటాడు దినకర్. అతనికి పూర్తి విరుద్ధంగా పొడవుగా, పీలగా 'రమణారెడ్డి' పర్సనాలిటీతో వున్నాడు ఇలాంగోవన్.

రెండు క్షణాలు అలలతో భీకరంగా వున్న సముద్రంవైపు ఏదో ఆలోచిస్తూ వున్నట్లు చూస్తూ వుండిపోయాడు ఇలాంగోవన్. "ఏ నాగాలేండో వెళ్ళి నరమాంస భక్షకుల జీవన విధానాన్ని నాలుగు రోజులపాటు అధ్యయనం చేసి ఓ రియల్ స్టోరీ తయారు చేయరాదా?" అన్నాడు దినకర్ వైపు తిరిగి నవ్వుతూ.

దినకర్ కస్సున లేచి "ఏమీ, నేనీ భూమిపై మిగిలుండటం నీకంత మింగుడుపడ్డం లేదా? పైగా అంత దూరం వెళ్ళి రిస్కీ స్టోరీస్ కవర్ చేసేంత టైం లేదని చెప్పానా" అన్నాడు దురుసుగా.

సర్వర్ తెచ్చిన రోటీలు సాస్‌తోబాటు తింటూ వుండిపోయారిద్దరు కాసేపు. హఠాత్తుగా ఇలాంగోవన్ ఏదో గుర్తొచ్చినట్లు చెప్పాడు.

"నేను మధురైలో పనిచేస్తున్నప్పుడు శశికాంత్ అనే గొప్ప సైకాలజిస్టు అక్కడ వుండేవాడు. పేరాసైకాలజీలో చాలా రీసెర్చి చేసి ఎన్నో సిద్ధాంత వ్యాసాలు, గ్రంథాలు రాశాడు. నేను వైజాగ్ వచ్చేసిన తరువాత ఆయనతో టచ్ పోయింది. నాలుగు రోజుల క్రితం ఆయన నాకు ఫోన్ చేసి ఏదో పర్సనల్ పని మీద ఇక్కడికి వస్తున్నట్లు చెప్పాడు. దాస్‌ప్రకాష్ హోటల్లో రేపు, ఎల్లుండి ఇక్కడ వుంటారు. నేనాయనకు నీ గురించి చెప్తాను. దెయ్యాలూ, భూతాలు, భూత్‌బంగళాల వంటి సంచలన వార్తలు, వాటి వెనుక అపోహలు, నిజాలు ఆయనకు తెలిసుంటాయి. ఆయనతో ఇంటర్వ్యూ తీసుకో. మీ పత్రికకు మంచి సబ్జెక్ట్ ఔతుందది" అన్నాడు.

దినకర్ మొఖంలోకి వెలుగు వచ్చింది. "అలాగే కానిద్దాం" అన్నాడు ఫింగర్ బౌల్‌లో చేతులు కడుక్కుంటూ.

రెండు నెలల క్రితం పేకాట క్లబ్‌లో అతనికి తమిళుడైన ఇలాంగోవన్‌తో పరిచయం ఏర్పడింది. ఇద్దరి అభిరుచులు ఒకటే కాబట్టి వారానికొకసారి కలిసి డిన్నర్ తీసుకుంటున్నారు. మెడికల్ రిప్రజెంటేటివ్‌గా పనిచేసే ఇలాంగోవన్ కబుర్ల పోగు, 'అతనికి తెలియని సబ్జెక్టు అసలేమైనా వుందా' అనుకుంటూ వుంటాడు దినకర్, చాలాసార్లు.

* * *

దినకర్ చెప్పింది విని తలపంకించాడు శశికాంత్.

"పారాసైకాలజీలో చాలా విభాగాలున్నాయి. దెయ్యాలు, భూతాలు పట్టిందనుకునేవారిని ట్రీట్ చెయ్యడంలో నాకు పెద్ద అనుభవం లేదు. మీకు ఇలాంగోవన్ క్లోజ్ ఫ్రెండంటున్నారు. కాబట్టి మిమ్మల్ని డిసప్పాయింట్ చెయ్యడం నాకిష్టం లేదు. ఇటీవలి కాలంలో ప్రొఫెసర్ నారాయణన్‌తో కలిసి నేను ఒక టాపిక్‌లో పరిశోధనలు జరుపుతున్నాను. అందులో చాలా ఆసక్తికరమైన విషయాలు వెలుగు చూశాయి. కానీ నారాయణన్ ప్రస్తుతం స్టడీ టూర్‌కని జర్మనీ వెళ్లాడు. మరో రెండు రోజుల్లో తిరిగివస్తాడు. నాలుగు రోజుల తరువాత న్యూఢిల్లీలో జరిగే ఓ సెమినార్‌లో మేమిద్దరం కలిసి మా పరిశోధనా ఫలితాలను ఒక పేపర్ రూపంలో వెల్లడి చేయాలనుకుంటున్నాం" అన్నాడు.

హోటల్ రూంలోని బాల్కనీలో రెండు ఛేర్స్‌లో కూర్చుని వున్నారిద్దరు. శశికాంత్ చెప్పే టాపిక్‌పై ఆసక్తి పెరిగింది దినకర్‌కు.

"సార్, మీరు రీసెర్చ్ చేస్తున్న టాపిక్ ఏమిటి? అన్నీ కాకున్నా కొన్ని వివరాలైనా నాకు తెలియజేయగలరా" అభ్యర్థనగా అడిగాడు దినకర్.


శశికాంత్ కొంత తటపటాయించిన తరువాత చెప్పాడు. "పునర్జన్మల గురించి రిసెర్చ్ చేస్తున్నాం మేము. ఈసరికే బ్రిడీ మర్ఫి, పీటర్ సెల్లార్స్ వంటి కేసులు ఈ విషయంలో విదేశాల్లో ఆసక్తి రేకెత్తించాయి. సీమంతిని కేసు ఇండియాలో చాలా ప్రాచుర్యం పొందింది. పునర్జన్మ ఏ మనిషికైనా తప్పదని విశ్వసించేవారు చాలామంది వున్నారు ఇండియాలో... తీవ్రమైన భావోద్వేగాలతో మరణించిన వారు, చివరి రోజుల్లో అశాంతితో కొట్టుమిట్టాడిన కొందరు వ్యక్తులు పునర్జన్మ పొందుతారని మేము పరిశోధించిన కేసుల్లో తేలింది. కొన్ని కేసుల్లో మాత్రం తాత్కాలికమైన హెలూసినేషన్ వ్యక్తులను పునర్జన్మ పొందినట్లు భ్రమింపజేస్తాయన్న నమ్మకం మాకు కలిగింది" అన్నాడు.

"సార్, మీరు పరిశోధించిన కొన్ని కేసుల గురించి మాకు వివరాలు చెప్పగలరా? మా పాఠకులకు మీ పరిశోధనలను వినూత్నంగా పరిచయం చేస్తాము" ఆసక్తిగా ముందుకు వంగి చెప్పాడు దినకర్.

"సారీ, మా పరిశోధనల సారాంశాన్ని న్యూఢిల్లీలో జరిగే సెమినార్లోనే ప్రపంచానికి వెల్లడించాలనుకున్నాం. అదీకాక నా సహపరిశోధకుని అనుమతి కూడా పొందవలసి వుంది" ఖచ్చితంగా చెప్పాడు శశికాంత్.

"ప్లీజ్ సార్, న్యూఢిల్లీలో సెమినార్ జరిగిన రెండు రోజుల తరువాతే మా పత్రిక మార్కెట్లోకి వెళ్తుంది. ఈలోగా మేము మీరు చెప్పిన కేసుల గురించి స్వయంగా వెళ్ళి ఇంటర్వ్యూలు తీసుకొని, ఫోటోలు అవీ సిద్ధం చేసుకుంటాం. ఎట్టి పరిస్థితుల్లో మీ రిసెర్చి వివరాలు బయటకు లీక్ చెయ్యం" అభ్యర్థనగా అడిగాడు దినకర్.

శశికాంత్ కాసేపు ఆలోచిస్తున్నట్లు కళ్ళు మూసుకుని ధ్యానముద్రలో కూర్చున్నాడు.



"ఒకే, మీరింతగా అడుగుతున్నారు కాబట్టి కొన్ని వివరాలు చెప్తాను. పునర్జన్మల కేసుల్లో ఈమధ్య మేము వెరిఫై చేసినవి, హుబ్లీలో ఒక టీనేజ్ గర్ల్ కేసు, చెన్నైలో కాలేజి స్టూడెంట్ కేసు, కేరళలోని కొట్టాయంలో ఒక పన్నెండేళ్ల అమ్మాయి కేసు, తాను సూసైడ్ చేసుకున్న ఒక తమిళ సినీ నటినను కుంటోందా అమ్మాయి..."

"సార్, ఆ ప్రాంతాలకు వెళ్ళేంత టైం లేదు. పైగా లేంగ్వేజ్ ప్రాబ్లం, ఆంధ్రా ప్రాంతంలో ఏవైనా..." దినకర్ ఆతృతతో ప్రశ్నించాడు.

"ఆంధ్రా అంటే షబ్బీర్ అహ్మద్ కేసొకటి, ధ్యాన్ చంద్, భూపతిరాయుడు, ఇంకా..." సాలోచనగా తల పంకించాడు శశికాంత్.

- "ఎవరు సార్ ఈ భూపతిరాయుడు?" ఆత్రంగా ముందుకు వంగి ప్రశ్నించాడు దినకర్.

"శ్రీకాకుళం ఏరియాలో పెద్ద జమిందారు, ఆఖరు రోజుల్లో ఆయన కనబడకుండా పోయారు. తిరుపతి యాత్రకని వెళ్ళి తిరిగిరాలేదట. బహుశా ఏ ఏక్సిడెంట్లోనో పోయాడేమో...' తాపీగా చెప్పాడు శశికాంత్.

"ఈ విషయంలో మీ పరిశోధన ఏం తెలుపుతోంది?" ఆసక్తిగా అడిగాడు దినకర్.

"కర్నూలు జిల్లా ఎమ్మిగనూరు సమీపంలోని గోనెగండ్ల అనే చిన్న విలేజ్, అక్కడ మురళి అనే పదేళ్ల కుర్రాడు ఈ మధ్య విచిత్రంగా ప్రవర్తిస్తున్నాడని, తల్లితండ్రులు కర్నూలు జనరల్ హాస్పిటల్లోని డాక్టర్లకు చూపించారు. పేషెంట్ మెంటల్ కండిషన్ అబ్‌నార్మల్‌గా వుండడం, మా పరిశోధనకు సంబంధించిన విషయం కావడంతో అక్కడి డాక్టర్ సుధాకర్ నాకు కబురు చేశాడు. సుధాకర్ నా క్లాస్‌మెటే‌లెండి పదేళ్ళ క్రితం మెడికల్ కాలేజిలో...పదేళ్ల మురళి తాను క్రితం జన్మలో భూపతిరాయుడినని చెప్తూ ఎన్నో ఋజువులు చెప్తున్నాడు. భూపతిరాయుడు హార్మోనియం అద్భుతంగా వాయించగలడు. అచ్చం అతనిలా పద్యాలు పాడుతూ హార్మనీ వాయిస్తున్నాడు మురళి. శ్రీకాకుళంలో భూపతి రాయుడికి చెందిన చీపురుపల్లి సంస్థానం గురించి ఎన్నో వివరాలు చెప్తున్నాడు..." శశికాంత్ మాటలను మధ్యలోనే కట్ చేశాడు దినకర్.

"సార్, ఇందాక మీరు భూపతిరాయుడు తిరుపతి యాత్రకని వెళ్లి తిరిగి కనబడలేదన్నారే, ఆ వివరాలేమ్మైనా చెప్పాడా మురళి? ఎందుకంటే ఆయన చావు మిస్టరీగా వుందన్నారు కదా..."

"లేదు, భూపతిరాయుడి గురించి చీపురుపల్లిలో వాకబు చేశాం. ముసలితనంలో ఆయనకు బుద్ధి బాగా మందగించిందట. తరచు విషయాలు మరచిపోవడం, తానెవరో కూడా గుర్తుకురానంత తీవ్రమైన మనోవైకల్యానికి గురయ్యాడట. ఒక యాక్సిడెంట్లో భార్య, ఇరవై ఏళ్ల కూతురు మరణించడంతో ఇలా తయారయ్యాడని రాయుడిని బాగా ఎరిగిన పాత తరం వాళ్ళంటున్నారు. బహుశా అందుకేనేమో మురళి రాయుడి చివరి దశలో జరిగిన విషయాలేమీ గుర్తులేవు" అన్నాడు శశికాంత్ సాలోచనగా.

"సార్, నేనూ శ్రీకాకుళం వాణ్ణే. భూపతిరాయుడి అదృశ్యంపై అప్పుడు చాలా దుమారం చెలరేగింది. ఇది డెఫినెట్‌గా మా పత్రికకు సెన్సేషనల్ న్యూస్ ఔతుంది"

"కానీ, మురళికి ఏ ట్రీట్‌మెంటో ఇచ్చి పాత విషయాలు గుర్తుకు తెస్తే భూపతిరాయుడి అదృశ్యం వెనక రహస్యం బయటపడుతుందేమో" అన్నాడు దినకర్ ఆత్రంగా.

"మేము ఆ ప్రయత్నమూ చేశాము. హిప్నాటిక్ రిగ్రెషన్ అన్న సజెషన్స్ ద్వారా మురళికి రాయుడి చరమాంకంలో జరిగిన సంఘటనలను గుర్తుకు తెచ్చేందుకు ప్రయత్నించాము. కానీ మా ప్రయత్నం సఫలం కాలేదు.

కానీ ఆ రోజుల్లో జరిగిన షాకింగ్ ఇన్సిడెంట్ గాని, మరొక గాఢమైన స్మృతి కానీ ఎవరైనా మురళికి గుర్తు చేస్తే తప్పక అతనికి ఆ సంఘటనలన్నీ గుర్తుకు

వచ్చే అవకాశం వుంది. పౌర్ణమినాడు, అమావాస్య, పున్నమి ముందు రోజుల్లో అతనికీ గత జన్మ స్మృతులు ఉధృతంగా గుర్తుకు వచ్చే అవకాశం వుంది" ఆలోచిస్తూ చెప్పాడు శశికాంత్.

ఆసక్తిగా వింటున్న దినకర్ దవడ కండరం బిగుసుకొంది.

“సార్, ఇది పరిశోధించి తీరవలసిన విషయం. నేను రేపే ఎమ్మిగనూరు బయలుదేరుతున్నాను” ఎక్సైటింగ్‌గా అన్నాడు దినకర్.

* * *

టాక్సీలో పన్నెండు గంటలు ఏకధాటిగా ప్రయాణించి మురళి వాళ్ల వూరు గోనెగండ్ల చేరుకున్నాడు దినకర్. ముందు మురళి వాళ్ల తల్లిదండ్రులు పిల్లవాణ్ణి దినకర్ ఇంటర్వ్యూ చేయడానికి ఒప్పుకోలేదు. డాక్టర్ శశికాంత్ చెప్పాడన్న మీదట కష్టంమీద ఒప్పుకున్నారు. తనతో తెచ్చిన స్వీట్ పాకెట్లు, పళ్లబుట్ట వారికి సమర్పించుకున్నాడు దినకర్. డ్రైవర్‌ను ఫోన్ చేసినప్పుడు రమ్మని పంపించేశాడు.

“మేము గుడి దగ్గర హరికథ వినడానికి వెళ్తున్నాం. పిల్లకాయనెక్కువగా బాధపెట్టద్దు. అసలే మతి చెడినోడు” అని దినకర్‌కు జాగ్రత్తలు చెప్పి బయటకు వెళ్ళిపోయారు మురళి అమ్మానాన్నలు.

అమావాస్య ముందు రోజేమో దట్టమైన చీకటి. చుట్టుపక్కల ఇళ్ళల్లో కూడా సందడి లేదు. బహుశా అందరూ హరికథ వినడానికి వెళ్లినట్లున్నారు. ఇంటి వెనుక పెరట్లో వున్న గడ్డివాము దగ్గర గుంజకు కట్టిన ఆవుచప్పుడు చేస్తూ కుడితి తాగుతూ వుంది.

కాసేపు మురళితో అతని స్కూలు గురించి, తోటి పిల్లలు, మేష్టార్ల గురించి, ఆటపాటల గురించి మాట్లాడాడు దినకర్. మామూలు పిల్లవాడిలా అన్నిటికీ హుషారుగా సమాధానమిచ్చాడు మురళి.

‘ఇతనిలో ఏ ప్రత్యేకతా వున్నట్లు లేదు. అనవసరంగా తానింత దూరం వచ్చాను’ అనుకున్నాడు దినకర్.

హఠాత్తుగా మురళిలో అనూహ్యమైన మార్పు వచ్చింది. చరచరా ముందు గదిలోకి నడిచి హార్మోనియం ముందు కూర్చుని అద్భుతమైన రాగం పలికించి “తమ్ముని కొడుకులు సగపాలిమ్మనిరి” అని పద్యం అందుకున్నాడు.


దినకర్ నిశ్చేష్టుడై చూశాడు. పద్యం ముగియగానే, “మురళీ, నీకు హార్మోనియం వాయించడం కూడా వచ్చా?” అని ఆశ్చర్యంగా అడిగాడు.

మురళి దినకర్ వంక తీక్షణంగా చూశాడు. అతని కళ్లు చింతనిప్పుల్లా వున్నాయి.

“ఎవడ్రా మురళీ, నేను జమిందారు భూపతిరాయుణ్ణి, రెండు వందల ఎకరాల మాగాణి, పాతికెకరాల్లోని కొబ్బరి తోటకు ఓనర్ని, కళాపోషకుణ్ణి. ఈ చేతుల్తో వందలాది నాటకాలు వేయించాను. ఆ నటులకు, గాయకులకు లక్షల్లో నజరానా ఇచ్చాను” అన్నాడు గంభీరంగా. అతని గొంతు పిల్లవాడి స్వరంలా లేదు.

## నో రికమెండేషన్!

ఇదిగో అదిగో అంటూ వస్తున్న సల్మాన్‌ఖాన్-కత్రినా కైఫ్‌ల పెళ్లి మాటేమోగానీ కత్రినా మాత్రం తనకి సల్మాన్ రికమెండేషన్లేమీ లేవు అంటోంది. సుభాష్ ఘాయ్ కొత్త చిత్రంలో హీరోయిన్‌గా కత్రినాకి అవకాశం రావడానికి కారణం- సల్మాన్ రికమెండ్ చేయడమేనని బాలీవుడ్‌లో చెప్పుకుంటుంటే- కత్రినా మాత్రం తనకి అలాంటి సిఫారసులు అవసరంలేదని, ‘నమస్తే లండన్ సినిమాలో తన నటన నచ్చి సుభాష్ తనకీ అవకాశం ఇచ్చినట్టు, సల్మాన్ జోక్యంగానీ రికమెండేషన్‌గానీ లేదు అని కచ్చితంగా తేల్చి చెబుతోంది కత్రినా.



మురళి అలా అంటుండగా దినకర్ చటుక్కున అతణ్ణి ఒక ఫోటో తీశాడు. టేప్ రికార్డర్‌లో మురళి మాటలు టేప్ చేస్తున్నాడు.

మురళి చటుక్కున ముందుకు దుమికి దినకర్ చేతిలోని కెమెరా లాక్కోబోయాడు. కానీ దినకర్ పడనివ్వలేదు.

“ఇక నేను హార్మోనియం ప్రాక్టీసు చేసుకోవాలి, నువ్వు బయటికెళ్ళు” కోపంగా అన్నాడు మురళి.

దినకర్ చిన్నగా లేచి మురళి దగ్గరకు వచ్చాడు. “భూపతిరాయుడూ, నన్ను బాగా చూడు. ఎనిమిదేళ్లప్పటి నుంచీ నీకు నేను బాగా తెలుసు. మీ ఇంట్లోనే వుండి నీకు కాళ్లు పట్టడం, ఒళ్లు తోమడం వంటి పనులు, బజారు పనులు అన్నీ చేసేవాడిని. ఒకసారి నేను జామచెట్టు నుండి పడి కాలు విరగ్గొట్టుకుంటే నువ్వు టౌనుకు తీసుకెళ్లి కట్టుకట్టించావు. నాటకాల్లో నీకు మేకప్ కూడా చేసేవాణ్ణి” చెప్పాడు మెల్లగా.


మురళి కళ్లల్లో అనూహ్యమైన మార్పు వచ్చింది. దినకర్‌ను పరిశీలనగా చూశాడు.

“ఔనురా, నీ పేరు దినకరనుకుంటాను. నా ఇంట్లోనే పెరిగినావు నువ్వు. నీకు శ్రీకాకుళంలో కొండారెడ్డి డాక్టరు దగ్గర కట్టు కట్టించింది నేనే. పదిహేనేళ్లకే లంక పొగాకు చుట్టలు తాగి నా దగ్గర తన్నులు తిన్నావు కదా” అన్నాడు.

“మురళీ.. కాదు కాదు.. రాయుడూ, బాగా గుర్తుకు తెచ్చుకో. నీ భార్య, ఒక్కగానొక్క కూతురు పోయిన తరువాత నువ్వు బాగా కృంగిపోయావు. నీ పొలాలను, తోటను అమ్మివేసి బంగారంగా మార్చి, నీ భార్య నగలతోబాటు ఒక చెక్క పెట్టెలో పెట్టి ఎక్కడో దాచిపెట్టావు. అది ఎక్కడ పూడ్చిపెట్టావో నాకు చెప్పు. నీకు బాగా కావలసినవాణ్ణి కదా” లాలనగా అడిగాడు దినకర్.

మురళి ఆలోచిస్తున్నట్లు తల గీరుకొని, తీవ్రంగా ఏదో జ్ఞప్తికి తెచ్చుకుంటున్నట్లు వుండిపోయాడు.

“ఔనురా దినకరా, నువ్వంటే గుర్తుకొస్తున్నది. కానీ ఆ పెట్టెనెక్కడ దాచానో నాకే




గుర్తులేదురా. ఆఖరి రోజుల్లో నాకు మతి మరుపు చాలా తీవ్రమయ్యింది కదా" దిగులుగా అన్నాడు.

శశికాంత్ చెప్పిన మాటలు గుర్తుకు వచ్చాయి దినకర్‌కు.

"రాయుడూ, నేను గుర్తు చెస్తాను. కార్లో నువ్వు తిరుపతి యాత్రకు ఒక్కడే బయల్దేరావు, గుర్తుందా?" అడిగాడు చిన్నగా.

గుర్తులేదన్నట్లు తల అడ్డంగా వూపాడు మురళి.

"ఆ యాత్ర ముగిసిన తరువాత నేను, కారు డ్రైవరు అప్పారావు నిన్ను దారిమళ్ళించి మామండూర్ అడవిలోకి తీసుకెళ్లి నిధి రహస్యం చెప్పమని చిత్రహింసలు పెట్టాము. వాటికి తట్టుకోలేక నువ్వు చనిపోయావు. అడవిలోనే నీ శవాన్ని కాల్చి బూడిద చేశాము. నీ షర్టు జేబులో మాకు ఈ తాళం చెవి దొరికింది. దీన్ని చూసైనా గుర్తుకు తెచ్చుకో" దాదాపు ఆరంగుళాల పొడవైన ఇనుపతాళాన్ని చూపాడు దినకర్.

మురళి నిస్త్రాణంగా సోలిపోతున్నట్లుగా వున్నాడు. భయంతో వణికిపోతూ వున్నాడు.

"ఔనురా, గుర్తుకొస్తోంది చిన్నగా. మరి అప్పారావేమయ్యాడు?" అన్నాడు వణుకుతున్న గొంతుతో. భయంతో నిలువెల్లా కంపించిపోతున్నాడు దినకర్‌ను చూసి.

"అప్పారావు కారును కోయంబత్తూరులో అమ్మేసి, అక్కడే టాక్సీ డ్రైవర్‌గా సెటిలయ్యాడు. నాలుగేళ్ల క్రితం కేన్సరుతో మరణించాడు. రాయుడూ, నువ్విప్పుడైనా ఆ నిధి ఎక్కడ దాచావో చెప్పు లేదా నిన్ను కిడ్నాప్ చేసి మళ్లీ చిత్రహింసలకు గురి చేయగలను" తీక్షణంగా అన్నాడు దినకర్. అతని గొంతులో క్రౌర్యం వుట్టిపడుతోంది.

మురళి దినకర్ వంక భయంగా చూశాడు.

"ఆ నిధి ఎక్కడ దాచానో నాకు గుర్తుకు రావడం లేదు. ఒకవేళ వచ్చినా, నీలాంటి నమ్మకద్రోహికి చచ్చినా చెప్పను. ఇక ఇంతమంది మా వాళ్లు చుట్టూ వున్నప్పుడు నన్నిక్కడి నుంచి కిడ్నాప్ చేయడం అసాధ్యం" అన్నాడు నవ్వుతూ.

దినకర్ ఆవేశంతో వూగిపోయాడు. "ఐతే నా చేతుల్లో నీకు మళ్లీ చావు తప్పదు" అన్నాడు ఆవేశంగా. అతని చేతులు మురళి మెడ చుట్టూ బిగుస్తున్నాయి. మురళి కెవ్వున కేక వేశాడు.

"దినకర్, స్టాపిట్, హేండ్సప్" అన్న గొంతు విని ఆశ్చర్యంగా పక్కకు చూశాడు దినకర్. బయట పార్క్ చేసి వున్న అతని కారు వెనుక నుండి వచ్చాడక్కడికి యూనిఫామ్‌లోని ఎస్సై. అతని చేతిలో రివాల్వర్ మెరుస్తూ వుంది. గడ్డివాము వెనక నుండి ఇద్దరు పి.సిలు అక్కడకు చేరుకున్నారు. దినకర్ కొయ్యబారిపోయాడు.

"మిస్టర్ దినకర్, నేను భూపతిరాయుడి కేసు ఇన్వెస్టిగేట్ చేసిన ఎస్సై జగదీష్‌ను. అప్పట్లో నీ మీద అనుమానం కలిగినా సాక్ష్యాలేమీ లేకుండా నువ్వు జాగ్రత్తపడినందున నిన్నేమీ చేయలేకపోయాం. అప్పారావు ఆచూకీ కూడా మాకు దొరకలేదు.

పురావస్తు శాఖ వారి తవ్వకాల్లో రెండు నెలల క్రితం భూపతిరాయుడు కట్టించిన నాటకశాల ఆవరణలో అతడు నిధిని దాచిన పెట్టె దొరికింది. తాళం చెవి లేనందున ఆ పెట్టెను తెరవడం వీలు కాలేదు. నగిషీలు చెక్కిన ఆ పెట్టెను నాశనం చేయడం మాకిష్టం లేకపోయింది.

భూపతిరాయుడి దూరపు బంధువు శశికాంత్, నీ మిత్రుడు ఇలాంగోవన్ పోలీసు శాఖ అభ్యర్థన మేరకు మాకు సహకరించారు. ఇక ఇంతసేపు నీ ముందున్న మురళి ఒక చైల్డ్ ప్రాడిజీ. మంచి నటుడు, హార్మోనియం ఆర్టిస్టు కూడా. చీపురుపల్లి విషయాలు ఆ వూరినుండి తెలుసుకుని, మురళికి ట్రైనింగిచ్చాం. అతనికి మంచి రివార్డు దక్కుతుంది. ఇక నీ మాటలను నువ్వే టేప్ చేసి మాకు శ్రమ తగ్గించావు.

నీ అరెస్టే మీ పత్రికకు మంచి సంచలన వార్త కాగలదు" అని దినకర్ చేతులకు సంకెళ్లు తొడిగాడు.

చేష్టలుడిగినవాడిలా పోలీసులను అనుసరించాడు దినకర్.

## దీపికకి సల్మాన్ సలహా!



అందరూ అంచనాలు వేసినట్టే ఇప్పుడు 'ఓం శాంతి ఓం' ఘనవిజయం సాధించడంతో ఆ సినిమా హీరోయిన్ 'దీపికా పదుకొనే'కి ఆఫర్లు వచ్చిపడడం మొదలైంది. ఈ సినిమా షూటింగ్ దశలో వున్నప్పుడు సల్మాన్ ఖాన్ ఆమెకి ఓ సలహా ఇచ్చాట్ట. 'నీ బాయ్ ఫ్రెండ్ నిహార్ పాండ్యాని నువ్విప్పుడే డ్రాప్ చేయడం మంచిది. లేదంటే నీ తొలి చిత్రం హిట్టయ్యాక ఎలాగూ డ్రాప్ చేయాల్సి వస్తుంది. అప్పుడు అతనికి అనవసరమైన మనోవేదన మిగులుతుంది' అని నవ్వుతూ చెప్పాట్ట. ఇందులో ఆయనగారి స్వీయ అనుభవం ఏమైనా వుందేమో!